కథానిక

# పరికొత్త పాతకథ

పి. వి. పల్లి

"తెల్లవారింది-లేవండి" అంటూ మా సుగుణ నను లేపింది. కళ్లు నులుపుకుంటూ లేచి కూచునా, యింతట్లో లోనికివెళ్ళి పుడకా నీళ్ళూ తెచ్చి అందించింది. వీధి గుమ్మంలో కొచ్చి-గోడప్రక్కనివున్న అరుగుమీద కూచుని, నోట్లో పెట్టుకున్న పుడక నములుతున్నా, అలా దీర్ఘంగా చూస్తూ

తలెత్తి చూశాను—ఎదురుగా ప్రత్యక్షమయ్యాడు సుదర్శనం. తెల్లారేసరికి ఊడిపడ్డాడు-ఏదో కారణం వుంటుందనుకున్నా, అతని ముఖలక్షణాలను చూచి.

"ఎలా వచ్చావురా?" అడిగేను. ఈ వూరు రావటం మరీకష్టం. రైలుస్టేషను నాలుగుమైళ్ళ దూరంలోవుంది. బస్సురోడ్డు అంతకన్నా దూరం.

మళ్లీ అడిగేను.

"రాత్రి ట్రెయిన్‌లోదిగి-యిలావస్తున్నాను." అన్నాడు మెల్లిగా మాటల్లో "బరువు" వుంది. ఏదో కొంప మునిగిందనుకున్నాను. అసలు స్టేషను నుండి-యీ వానాకాలంలో నడిచిరావడం యేమంత సులభమయిన పనికాదు. జారు-బురదల్లోంచి నడిచి రావాలి.

"మొహం కడుక్కున్నావా?–" అడిగేను.

"లేదు" అన్నాడు ముక్తసరిగా.

సుగుణని పిలిచి వాడికూడా పుడక, నీళ్లు సప్లయిచేశాను. వాడు నా ప్రక్కని కూచుని పళ్లు తోముకుంటూంటే, వాడి మొహంకేసి దీర్ఘంగా చూస్తూ కూచున్నా.

లోపలికెళ్ళి ఇద్దరం కాఫీలు తాగాం. సిగరెట్టు ముట్టించి, అగ్గిపుల్లని కిటికీలోంచి బయటకి విసిరేసి-వచ్చి కూచున్నాను కుర్చీలో...సుదర్శనంలో యే మార్పూరాలేదు. వచ్చి అప్పుడే గంటదాకా గడిచినా, ముఖంమాత్రం విచారపూరితమయే వున్నది.

నేనే అడిగాను—"అలా వున్నావేంరా?–" జవాబివ్వలేదు - మళ్ళీ అడిగేను. "ఏముంది శేఖరం నా జీవితం యిల్లా వుండవలసిందే—" అన్నాడు నిస్పృహతో.

అలా అనడానికి కారణం ఏదో అర్థంకాలేదు నాకు.

"ఏం అలా అంటున్నావ్?" ప్రశ్నించాను.

"అడక్కు మరి నేను చెప్పలేను–" ముఖం ప్రక్కకి తిప్పుకుంటూ అన్నాడు.

"ఇవాళ నువ్వు స్కూలికి పోవద్దు. మనం మాట్లాడాలి–" అన్నాడు మళ్ళీ. క్రొత్తగా స్థాపించిన హయ్యర్ ఎలిమెంటరీ స్కూల్లో హెడ్మాష్టరుగా వున్నాను నేను. స్థాపించి నెల పదిహేనురోజులు అయింది. ఇంకా స్కూలుకు సంబంధించిన విషయాలని ఆకళింపు చేసుకోలేదు నేను. అయినా—"సరే" అన్నాను.

"డ్రెస్సు విప్పి-స్నానంచేదువు గానిలే—అప్పుడు మాట్లాడుదాం—" అన్నాను. ఈ లోగా వాడిమనసు కొంత కుదుటబడుతుందన్న నమ్మకంతో లేచి యిద్దరం నూతిదగ్గరకి స్నానానికి పోయాం.

టేబిలుకి యిరుప్రక్కలా కూచున్నాం యెదురెదురుగా. జేబులోంచి కార్డుసైజుఫొటో నొకదాన్ని నాముందు పడేశాడు చూశాను. అది ఓ అమ్మాయి ఫొటో. చూడ్డానికి ఆకర్షణీయంగానే వున్నది విగ్రహం. అయితే వీడివిషయం ఇందుకు సంబంధించిందే కాబోలు ననుకున్నాను.

"అయితే...?" అన్నాను, జరిగిన సంగతి చెప్పమన్నట్టుగా. కళ్లు చెమ్మగిల్లాయి సుదర్శనానికి. నాకేమీ అర్థం కావడంలేదు. "చెప్పవోయ్—ఏం జరిగిందో?" అన్నాను. చెప్పడం ప్రారంభించాడు.

"నేను పరీక్షలముందు ఉత్తరంవొస్తే ఇంటికి వెళ్ళాను. ఎందుకో అనుకున్నాను. "ఓ సంబంధం చూచాం. పిల్లని చూసుకుందికి రేపు వస్తామని వాళ్ళకి కబురుచేశాం. రేపు మనం వాళ్ళవూరు వెళ్ళాలి" అన్నారు మానాన్న. ఆ మర్నాడే

నేనూ, నాన్నా, యింకా మరికొందరూ కలిసి ఆ వూరు వెళ్ళాం. పిల్లని చూచేను" ఆగాడు సుదర్శనం. విజయవాడలో మేం కలిసివున్న కాలంలో యెప్పుడూ యింత నిరాశగా మాట్లాడలేదు.

"తరవాత?" అన్నట్లు ప్రశ్నార్థకంగా చూశాను.

"నాకు అమ్మాయి నచ్చింది" మళ్ళీ ఆగాడు.

"అయితే అమ్మాయికి నువ్వు నచ్చలేదా?" అడిగాను సంశయంగల్గి.

"అలా అయితే బాగానే వుండును. ఆ అమ్మాయికూడా నచ్చింది నన్ను పెళ్ళాడటానికి కాని..." కాస్సేపాగి మళ్ళీ మొదలెట్టాడు. "వాళ్ళపినతల్లికీ, తన తండ్రికీ నేను నచ్చలేదుట."

"ఏం తల్లిలేదా పిల్లకి?" అడిగాను.

"లేదు. పినతల్లి చేతిలోనే పెరిగిందట. ఆవిడ తలచెడ్డది"

"అయితే వాళ్ళకెందుకు నచ్చలేదు?—"

"ఏమో కొంతకాలం పోయిం తర్వాత అందంగా లేనని కబురుపెట్టారు"

"వాళ్ళకి అందంగా అవుపించక పోయినంత మాత్రాన యీ సంబంధం కాదనడం భావ్యంగా తోచలేదు నాకు."

"యింతకీ పిల్లయిష్టపడ్డదిగా" అన్నాను.

"అవును. అయితే యెల్లా సాధ్యమౌతుంది?" అన్నాడు.

ఆలోచనలో పడ్డాను. "యిది జరిగి ఎన్నాళ్ళయింది?" అడిగాను.

"మూడునెలల క్రిందటిమాట. అంటే వేసవి శలవులముందు"

"అయితే యీలోగా మరోసంబంధమేదన్నా స్థిరపడ్డదా వాళ్ళకి?"

"స్థిరపడిందట. కాని నాకో అనుమానం కలుగుతూంది."

"యేమిటది?"

"పిల్ల అందుకు ఒప్పుకుని వుండదు"

"సరే దానిమాటకేం. నువ్వు మరోసంబంధం చూసుకోక పోయావా?"

"నా మనస్సొప్పటంలేదు. ఆ పిల్లనే పెళ్ళి చేసుకుందామని వుంది."

"మరి వాళ్ళకి యిష్టం లేదటగా. యెలా సాధ్యమవుతుంది?—"

వూరుకున్నాడు మాట్లాడకుండా.

"ఏవూరు వాళ్ళది?"

"మావూరికి దూరంకాదు దగ్గిరే—"

"అయితే ఆవూరు వెళ్ళలేకపోయావ్?—"

"ఎలా వెళ్ళడం?"

"పోని యెవర్నన్నా పంపించ వలసింది"

"ఆ పని చేశాను. అప్పుడే మరో సంబంధం స్థిరపడినట్లు తెల్సింది"

"ఒరే సుదర్శనం మరోసంబంధం చూసుకుందూ. అంతకంటే గొప్పవాళ్ళే దొరుకుతారు—"

"నామనస్సొప్పటంలేదురా. యెల్లాగన్నా ఆ అమ్మాయినే..."

"అదిమరి సాధ్యం కాదుగదరా. యింతకీ మరోసంబంబంధం స్థిరపడిందంటున్నావ్—"

"ఎలాగన్నా ఆసంబంధం—"

"కాకుండా చేదామనా?—"

నసిగాడు సుదర్శనం, అదే తనవుద్దేశం కాబోలు. మళ్ళీ అడిగాను.

"అదేనంటావా నీ వుద్దేశం?"

"అవుననుకో"

"మరి సంశయం ఎందుకు?—"

"కాని అదికూడా అంత సబబుకాదేమో"

"నీ వుద్దేశం యేదో పూర్తిగాచెప్పు- ఆలోచిద్దాం—"

"ఆ సంబంధం యేవూరిదో వాళ్ళెవరో పిల్లకి ఆ సంబంధంయందు యిష్టమున్నదో లేదో..."

"యివన్నీ యెందుకురా. పిల్ల యిష్టపడే వుంటుంది. అందుకనే వాళ్లు ఆ సంబంధాన్ని స్థిరపరిచారు"

"పిల్ల పెళ్ళాడుతూందో లేక పెళ్ళాడబడుబడుతూందో అని..."

"నీ అనుమానం—"

"అవును బలవంతమే అయితే యెల్లాగయినా తప్పించాలి."

"ఒరే సుదర్శనం నామాటవిను. అవూసెత్తకు మరి. మనయిళ్ళల్లో అంతపాటి సంస్కారం యింకాజరగలేదు. అసలు మనయిళ్లో వాతావరణమే వేరు."

"అదికాదురా చూస్తూ వూరుకోవడమేనా? అని"

"చేసేదేముంది! మనం ముందుకు వెళ్ళి కుర్రకుంకలు పొండోయ్ అంటారు."

"అననీవోయ్. ఆ తరవాత చూదాం—"

"నీ వెర్రిగాని మనయిళ్ళల్లో పెరుగుతున్న వాళ్లు మనయింటి వాతావరణాన్నే సరిగ్గా గ్రహించుకోలేరు వాళ్లుఅలా పెంచబడ్డారు. దానికి మనం చెయ్యవలసింది ఒక్కటే. మంచి వాతావరణాన్ని సృష్టించటం—"

"అదంతా అయ్యేసరికి యీ సంబంధం ఆగుతుందా. యీ పెళ్ళి ఆగుతుందా?—"

"తీరా మనం వాళ్ళయింటికి వెళతామే అనుకో - వెళ్ళి చేసేదేముంది?—"

"వాళ్ళతో యీ విషయంగూర్చి మాట్లాడ్డమే."

"మీపిల్లకి యీ క్రొత్తసంబంధం యిష్టమవునా? కాదా" ఇదేనా నీప్రశ్న.

"అదికాదోయ్ మావాడు మీపిల్లని పెళ్ళిచేసుకోవడానికి యిష్టపడ్డాడు. మీపిల్లకూడా యిష్టపడింది కదా..."

"అని అడగమంటావు అంతేనా?"

"అవును."

"నువ్వింకా పెరటిదారిన వున్నావు. మన యిళ్ళల్లోవున్న యిప్పటి పెద్దలు మరి మారరు. వాళ్లు ఆఖరినాడే మారేది. మనం ప్రయత్నించినా లాభం లేదు—"

"అక్కడే నువ్వు తప్పటడుగులువేస్తున్నావు—" అన్నాడు సుదర్శనం. నేను జంకాను. మళ్ళీ అన్నాడు

"మనం చెయ్యలేమనుకుని యే పనినీ మానకూడదు. ప్రయత్నించాలి. ఆ తరవాత ఫలితం దారి వేరు."

"ఫలితంలేనిదానికి మనమెందుకు తాపత్రయపడటం అంటాను."

"నిను చెప్పలేంరా. నీకు సలహాయిచ్చినా నా పనిని నెరవేరుస్తావని నీదగ్గరకొచ్చాను. కాని యిలా అంటావని అనుకోలేదు."

"అదికాదురా. నీమీద ద్వేషమానాకు—పద. తప్పకుండా వెళదాం, అడుగుదాం. కాని..."

"అదిగో...ఆఁ. ఏమిటి నువ్వనేది?"

"సరే వెళతాం. వెళ్లి 'మీ పిల్లకి యిష్టంలేని సంబంధం చేస్తున్నారు'—అని అడుగుతావా?"

[illegible] చెయ్యాలి యథార్థవిషయాలగూర్చి."

"నేనో మాటంటాను ఆలోచించు, ఆ అమ్మాయి కాస్త చదువుకున్నదయితే, గ్రహించగలుగుతుంది యథార్థాన్ని, యిష్టమైనవాణ్ణి పెళ్లి చేసుకుంటానని పట్టుపడుతుంది. అయితే, ఇంకా మనవూళ్ళల్లో స్త్రీకి విద్య నేర్పించటంపట్ల అశ్రద్ధ చూపిస్తున్నారు మనవాళ్లు. కరడుగట్టుకుపోయిన పాతసంప్రదాయాలనే మన ముసలాళ్లు ఆచరిస్తున్నారు. మన బతుకులు నాశనమవుతున్నాయని చూడరువాళ్లు. యేమేనా అంటే "మాకాలంలో మేం ఇలాంటి వెరగమమ్మా"అని దవడలునొక్కుకోవడమూ, "మా నాన్న నాకు పెళ్ళిచేసేటప్పుడు అడిగేచేశాడా?" అనడమూ, ఇంకా వదల్లేదు మనవాళ్లు. అందుచేత వాళ్ళని మార్చడానికి మనం ప్రయత్నంచెయ్యాలి. తీరానువ్వన్నట్లు పిల్లకిష్టమో కాదో కనుక్కుంటామనుకో, యిష్టమే అంటుంది! యెందుచేతంటే వాళ్ళవాళ్లు ఒళ్లు హూనంచేస్తారేమోనని భయం కాదన్నట్లయితే."

"పోనీ మీ అమ్మాయికి నన్ను పెళ్ళిచేసుకోవడం యిష్టమే మీరు మరోలాచెయ్యడం తప్పు అని అంటే?"

"అలాగే అన్నామనుకో, యిక ఆ అమ్మాయి మీద లేనిపోని అనుమానాలు లేవదీస్తారు. అది మాట్లాడసిదే నీకెలా తెల్సు? మాట్లాడ్డానికిగల కారణమేమిటి? యెంతకాలంనుండి ఈ రహస్యం జరుగుతోంది?—అని యిలాంటి చెడ్డ అభిప్రాయాలని మనస్సులో వుంచుకుని, ఆ అమ్మాయిని చావగొడతారు"

"పోనీ, ఆ అమ్మాయితో రహస్యంగా మాట్లాడి, ధైర్యంచెప్పి, తీసుకొచ్చి పెళ్లి చేసుకుంటే?"

"అలా అన్నావు బాగుంది. యింతకీ, ఆ అమ్మాయి అందుకు సిద్ధపడుతుందో సిద్ధపడదో. అసలు తన బ్రతుకుని తనే బాగుచేసుకోవాలన్న అభిప్రాయం కలిగిందనుకోను. అలా అయితే మొదట్లోనే ప్రతిఘటించును. నీకో తార్కాణం చూపెడతాను—మా ఆవిడ కాపురానికొచ్చింతరవాత, యేదో మాటామాటావచ్చి—"యెన్నో సంబంధాలువచ్చినాయి. అన్నిటినీ మావాళ్ళు కాదన్నారు,"అన్నది మా ఆవిడ. "అయితే నీకు-

యిష్టమేనా?" అన్నాను. ఒక సంబంధం యిష్ట మయిందనీ. కాని వాళ్ళ అమ్మకి యిష్టంలేనందు వల్ల తప్పిపోయిందనీ చెప్పింది. అయితే ఎదురు తిరగలేకపోయావా? అన్నాను. "అమ్మో, మా అమ్మా నాన్నా, అమ్మమ్మా వూరుకుంటారా?" అన్నది కాబట్టి యిప్పటి ఆడపిల్లలు యిలాంటి వాతావరణంలోనే సృష్టించబడ్డారు. అసలు మనం చెయ్యవలసింది మంచి వాతావరణాన్ని సృష్టించటం. అందుకు వాళ్ళకు చదువుచెప్పించాలి."

"అదిసరే. యిప్పటిమాట చెప్పరా."

"పద వెళదాం—అడుగుదాం."

* * *

నేనొక్కడినే వెళ్ళాను వాళ్ళ యింటికి. గుమ్మములో అడుగుపెట్టేసరికి పంతులుగారు ప్రశ్నించారు.

"ఎవరు నాయనా నువ్వు?"

"మాది విజయవాడ."

"యేం వచ్చావు? రా కూర్చో."

కూచున్నాను పంతులుగారికి ప్రక్కగా చాప మీద.

"ఆఁ యేంలేదు. ఈ వూళ్ళో కొంచెం పని వుండి" అని బొంకేసు

"యీ వూళ్ళో యే పని?" సంశయంగా అడిగారు.

"అసలు నువ్వెవరివో చెప్పావుగావు" మళ్ళీ అడిగేరు.

"నేను ఓ మాష్టార్ని. ఈవూళ్ళోవున్న బళ్ళో ఖాళీవున్నదేమోనని .." అప్పటికి ఆ వుద్దేశ్యం యెలా స్ఫురణకొచ్చిందో నాకే తెలీదు.

"అలాగా. మీ యింటిపేరు?"

చెప్పాను.

"మీ రెందరన్నదమ్ములు?"

"ఒక్కణ్ణే."

"అప్పచెల్లెలు వున్నారా?"

"ఆ. యిద్దరున్నారు—నాకన్న పెద్ద ఒకరు, నా తరవాత ఒకరు."

"యిద్దరికీ పెళ్ళిళ్ళు అయ్యాయా?"

"రెండోదానికి కాలేదు."

"సంబంధాలు రాలేదా?"

"వస్తున్నాయి కాని అవి యిష్టపడకుండా వుంది."

"వాళ్ళ పెత్తనమేమిటోయ్—బోడిపెత్తనం"

నా కళ్ళు మండింది. అయినా సముదాయించుకొని, "మీకాలమనుకున్నారు కాబోలు కాలం మారింది."

"ఏదైనా వాళ్ళయిష్టం మంచిదికాదు."

"మరినాకుమాత్రం యిష్టంలేదు సుమండీ. వాళ్ళ పెళ్లికి వాళ్ళ యిష్టం కావాలిగాని మధ్య మనం యెందుకు. వాళ్ళంగీకరించిన దానిని మనం కాదనకుండా ఆ యింత సుముహూర్తం జరిపించెయ్యడమే మన పని."

"మీరు అనుభవంలేని కుర్రాళ్లు నాయనా—నీకు తెలీదు. మా కాలంనాడు..." మొదలు పెట్టాడు. వాళ్ళ పుట్టుపూర్వోత్తరాలు, పెళ్ళిళ్లు యేకరువు పెట్టాడు.

మధ్యలో అడ్డుతగిలాను, "మీ కెంతమంది పిల్లలు పంతులుగారూ?"

"యిద్దరు కొడుకులూ, ముగ్గురు కూతుళ్ళూను. కుర్రాళ్ళిద్దరూ చాలా చిన్నవాళ్లు. పెద్దదానికీ, రెండోదానికి పెళ్ళిళ్ళు చేశాను. నిక్షేపంలా వున్నారు వాళ్లు. బాగా భూమీ పుట్రా వున్న వాళ్ళే. బాగా ఆర్జించుకున్నారువాళ్లు."

"మూడో పిల్లకి పెళ్ళి చేయలేదన్నమాట"

"సంబంధంస్థిరపడింది. మాఘాదిపంచకాల్లో పెళ్ళిచేయాలి. చూడు నాయనా యీకాలంలో వందలతో తెమిలే పెళ్ళిళ్ళుకావు .." యిక ఆ సోది అంతా వెళ్ళబుచ్చడం మొదలుపెట్టేడు, పంతులు. అసలు విషయం దగ్గరకొచ్చింది వ్యవహారం. ఎలా మొదలు పెట్టడమా? అని ఆలోచించాను.

"ఏ వూరండీ ఆ సంబంధం?"

చెప్పారు వూరు పేరు.

"అతనేంచేస్తున్నాడు?"

"కరిణీకంచేస్తున్నాడు. కాస్త స్థిరోపాధివున్న వాళ్ళే. కుర్రవాడు నిరాడంబరుడు. అట్టేవయస్సుండదు. ముప్ఫయికిలోపు. మనపిల్లమాత్రం చిన్నదా పదిహేనుదాటి పదహారు."

నా గుండెలు గతుక్కుమన్నాయి. అంత తేడావున్నా యెలా స్థిరపడిందా అని అనుకున్నాను.

"మీ పిల్ల అంగీకరించిందా?"

"అంగీకరించకేం చేస్తుందోయ్—వాళ్ళని అడిగే చేస్తామటోయ్."

నాకు కోపంవచ్చింది.

"అయితే మీరు, ఆమె ఇష్టంలేకుండానే?"

"అవునోయ్, యెంతకని వాళ్ళ యిష్టాల్ని లెక్క చెయ్యడం మనం తీసుకొచ్చినవ టినన్నిటినీ వాళ్ళు కాదంటూనే వుంటారు"

"అలాగని, ఓ ముసలాడి మెడకి కట్టేస్తున్నారా?"

"నీకు చెప్పలేమోయ్."

"మరో సంబంధం యేదీరాలేదా?"

"వచ్చింది. మాకుదగ్గిరవూరేవాళ్ళది. అయినా కుర్రాడు చిన్న వాడు. యిరవై రెండోయేడట. మాకాలంలో కనీసం పదిసంవత్సరాలన్నా తేడా వుండాలవేవారు. అదీకాక కుర్రాడు మాకు నచ్చలేదు."

యిక అతనికి యెల్లానచ్చచెప్పడం? సిగిరెట్టు ముట్టించాను.

"కాసిన్ని మంచినీళ్ళిప్పిద్దురూ .." నిజంగా నాకు దాహమనిపించలేదు.

"సావిత్రీ! గ్లాసుతో మంచినీళ్ళతే అమ్మా" కేకేశారు పంతులుగారు.

ఆమె నీళ్ళు తెచ్చియిచ్చింది. చూడడానికి ఎంతో బాగుంది. కాని ముఖంమాత్రం కాంతివిహీనమైవుంది.

వచ్చినపని చెప్పేద్దామనుకున్నాను.

"పంతులుగారూ, నేను మీదగ్గిరపనిమీదనే వచ్చాను."

"యేమిటాపని?" అన్నట్లు ప్రశ్నార్థకంగా చూశారు నావేపు.

"చూశారూ. తప్పిపోయినసంబంధం గూర్చి"

"అవును. అతను సుదర్శనం అనుకుంటాను."

"వాడు నాకు తమ్ముడవుతాడు."

"ఆఁ!..." ఆశ్చర్యంగా చూశారు నావేపు.

"అవును. వాడికి మీ సావిత్రిమీద చాలా యిష్టంగావుంది. మీ పిల్లకూడా యిష్టపడ్డట్లు తెల్సిందట."

"యెలా తెల్సింది?"

"వాళ్ళ అమ్మ చెప్పిందట. ఆమె మీ పిల్లని అడిగితే ఊకొట్టిందట."

"ఆఁ...అంతమట్టుకొచ్చిందీ?"

"మరేం భయపడకండి! యిష్టంలేనివాళ్ళకి ముడిపెట్టి యేంలాభం. వాడుమాత్రం చిన్నవాడా. ఆరుసంవత్సరాలు తేడా వుంటుంది. అంతే."

"వాడికిచ్చి పెళ్ళిచెయ్యమంటావు."

"అవును వాళ్ళ యిద్దరికీ యిష్టమయింతర్వాత మధ్యను మనపెత్తనమెందుకండీ! మరింకాదుగా వాళ్ళతో కాపురంచేయడం, అంతే."

"అయితే యీ సంబంధానికి మాట ఇచ్చాను. ఎల్లుండే తాంబూలాలు పుచ్చుకోడానికి వాళ్ళు వస్తున్నారు, అయినా మాట తప్పేవాడినికాను. ఇంతకీ సుదర్శనంమీద మా కిష్టంలేదు..."

చచ్చేచా వొచ్చింది. మళ్ళీ మొదటి కొస్తున్నాడు పంతులు.

"అదికాదు పంతులుగారూ నామాట వినండి. ఆ తరవాత ఆలోచిద్దురుగాని .."

"ఏమిటయ్యా నువ్వనేది?..."

"ఇప్పుడు మీ సావిత్రీ, మా సుదర్శనం— యిద్దరూ యిష్టపడ్డారు. మనం యిష్టపడకపోయినంతమాత్రాన వాళ్ళ మాటల్ని లేదనకూడదు. పెళ్ళి ఆడవలసినవాళ్ళు ఆ యిద్దరే. పోనీ మీ పిల్లకి యిష్టంలేకపోతే చెప్పండి. తీరా మీరుగాని కాదంటే—ఆ తరవాత వాళ్లు అనేక చిక్కులు పడవలసివస్తుంది. దాని బతుకును పాడుచేసినవాళ్లమవుతాం. పోనీ కుర్రాడు అవిటివాడుకాడు. బీదవాడుకాడు. కుంటికాడు, యోగ్యత వున్నవాడే. తగినవాడుకూడాను."

"నువ్వు యెన్నైనా చెప్పు. కాని నా కిష్టం లేనిదీ ఆ సంబంధం స్థిరపరచను. చూస్తూచూస్తూ కుర్రకుంకకి ఎలా యిచ్చేనేది నా కూతుర్ని."

"వాడు కుర్రకుంక యెలా అవుతాడండీ?—"

"నువ్వు మరి మాటాడక పోయ్—యింతకీ మా యింటి వ్యవహారాలు నీకెందుకు?—"

"మీయింటి వ్యవహారాలు నాకు సంబంధించినవి కనక అడుగుతున్నాను. మా వాడికి పూర్తిగా వుద్రేకంవుంది. మావాడికోసమైనా..."

"పోవోయ్—చెప్పొచ్చావు మహా గొప్ప వాడిలాగ. నీకు యిష్టపేసి దేముంది? చూచినవన్నీ కావాలంటారు—" నాకు జాలివేసింది పంతులుగారి మాటలు వింటూంటే.

"అయితే పంతులుగారూ-నామాట వినరన్న మాట? మీపిల్ల బ్రతుకును చెడగొట్టకండి. దానికి యిష్టంలేని పెళ్ళి చెయ్యకండి—"

"ఈ పెళ్ళి దానికిష్టంలేదని నీకెలా తెల్సును?"

"దాసీ దానితో మీపిల్ల అన్నదన—"

"నాదగ్గరకొచ్చి యెప్పుడూ అనలేదు. బయట యెక్కడో అంటే నాకెందుకు అయినా దానికేం తెల్సు? పసిపిల్ల ముందు యిలాగే అంటారు. తరువాత "మా ఆయన..." అంటూ వొదల్నే వదలరు—"

"మరేం చేస్తారండీ మీరు మూర్ఖులయితే."

ఎలా అన్నానో నాకే తెలీదు, ఆ మాట.

"ఏయ్ మాటలు తిన్నగా రానీ. యీ వెధవలు చదువుతోబాటు యెదురు తిరగడంకూడా నేర్చుకున్నారు—"

"అదికాదు పంతులుగారూ "

"మరి మాటాడకు నువ్వు" కోపంగా అన్నారు కాస్సేపాగాను.

బుర్ర కిందికిదించి ఏదో ఆలోచించారు. తల పైకెత్తి కళ్లు ఎర్రచేస్తూ పళ్లు పటపటకొరుకుతూ, చేతిలోవున్న భగవద్గీత పుస్తకాన్ని గట్టిగా నేలకికొట్టి చరచరా యింట్లోకి వెళ్ళారు. ఏదో కొంప మునుగుతున్న దనుకున్నాను.

"ఏమే సావిత్రి..."పిలుపు వినిపించిందినాకు.

"ఏం నాన్నగారూ..."ఆ మాటలో దిగులు ప్రతి ధ్వనించింది.

"దాసీ దానితో నువ్వు ఏదో చెప్పావటగా."

కొంతసేపు నిశ్శబ్దం.

"ఏం మాట?—"

"నీకు తెలీదేం కరణంగారి సంబంధం ఇష్టం లేదని చెప్పావటగా..."

మళ్ళీ నిశ్శబ్దం.

ఏదో అనబోతున్నట్టు శబ్దం చేసిందా అమ్మాయి.

"వెధవలు రాలుగాయి పాపలయిపోతున్నారు. చదువుకుంటే యింకా మితి మీరిపోయి వుందురు. అయినా నువ్వు వద్దంటేమాత్రం ఆగిపోతుందంటే—"

ఒక్క చెంపపెట్టు వినపడ్డది. పాపం అమ్మాయి గోల పెట్టడం మొదలెట్టింది.

"ఇకముందెప్పుడూ యెవరితోనూ అనవుకద" మళ్లీ మరో దెబ్బపడిన చప్పుడు వినబడ్డది. నా మీద నేనే అసహ్యించుకున్నాను. అనవసరంగా ఆ అమ్మాయికి కష్టం కలిగించాను. ఏమో-ఆ అమ్మాయి బ్రతుకు యెల్లా వుంటుందో"—అనుకుంటూ మెల్లగా గుమ్మం దిగాను.

ఊరి చివరనున్న చెట్టుక్రింద కూచుని ఎదురు చూస్తున్నాడు సుదర్శనం.

"లాభం లేకపోయిందిరా—" అన్నాను.

"ఏం? ఏంజరిగింది?"

"పైగా ఆ అమ్మాయిని ఆసంబంధం వద్దన్నందుకు కొడుతున్నాడాయన" అన్నాను. మా వాడు అలాగే నుంచున్నపళంగా నేలకొరిగిపోయాడు.

"నేను చెప్పలేదటరా యీ సంప్రదాయాలు వాళ్ళతోగాని పోవు అయినా మనం రంకుతనం కోసం తాపత్రయపడకూడదు కూడాను"అన్నాను.

నేడు ప్రంపంచలో మానవచైతన్యం జాగరితమయింది. అత్యాచారం దక్షిణాఫ్రికాలో జరిగినా; సైబీరియాలో జరిగినా, ఎక్కడో అలబామాలో జాతివిచక్షణవల్ల ఒక బస్సులో జరిగిన సంఘటనను గూర్చిగాని, ఇండియాలో హరిజనుల బావివద్ద జరిగిన సంఘటనను గూర్చిగాని శతాబ్దం క్రిందట ఎవరికీ తెలిసేదికాదు; ఎవరూ పట్టించుకొనేవారుకారు. కాని ఈ సంఘటనలన్నీ నేడు ప్రపంచమానవ చైతన్యాన్ని ఉత్తేజితంచేసి, అంతా కలిసి ఆయాజాతుల సంస్కారానికి కృషిచేసేటట్లు చేస్తున్నది.